## క్లుప్తంగా

### మ్యాజిక్ డ్రైన్ ఏర్పాటు చేసుకోవాలి


పనులు పరిశీలిస్తున్న పీడీ జోసఫ్ కుమార్

టంగుటూరు: ప్రతి గ్రామంలో మ్యాజిక్ డ్రైన్ ఏర్పాటు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ జోసఫ్‌మార్ స్పష్టం చేశారు. మండలంలోని శివపురంలో ప్రతిష్టత్మకంగా మొదలుపెట్టిన మ్యాజిక్ డ్రైన్‌ను ఆయన గురువారం పరిశించారు. ఈ సందర్భంగా పీడీ, గ్రామ సర్పంచ్ వెంకటరావు గ్రామస్తులతో మాట్లాడి మిగిలిన పనిని త్వరగా చేయాలని సూచించారు.

### వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి


మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి

కొండపి: ప్రజలందరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సుశీలాదేవి అన్నారు. మండలంలోని కట్టవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆకుకూరలు, కాయగూరలు ఆహారంలో ఎక్కువ తీసుకోవాలన్నారు. బయట జంక్ ఫుడ్స్ తగ్గిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు. సెక్టార్ సూపర్‌వైజర్ టి.విక్టోరియా రాణి పాల్గొన్నారు.

### చెత్తను సేకరించి వర్మీ కంపోస్టుగా మార్చాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

కొండపి: చెత్తను సేకరించి వర్మి కంపోస్టుగా మార్చాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కె.ఉప్పలపాడు పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తడి చెత్త, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన కల్పించి ఐవీఆర్ఎస్ విలేజీలకు సంబంధించి ఫోన్ కాల్స్‌పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుధ్య పనుల్లో జిల్లా ముందు ఉండేలా పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రామాంజనేయులు, ఆర్‌పీ అశోక్, డిప్యూటీ ఎంపీడీవో అంజలీదేవి, పంచాయతీ కార్యదర్శి పుష్పలత పాల్గొన్నారు.

### రణభేరి జయప్రదం చేయండి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 25వ తేదీన విజయవాడలో తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, సీఎస్ పురం మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, జవంగుళ వెంకటరావులు అన్నారు. రణభేరి కార్యక్రమం జయప్రదం కోరుతూ తలపెట్టిన బైక్‌జాతాకు మద్దతుగా యూటీఎఫ్ నాయకులు ర్యాలీగా కనిగిరి తరలివెళ్లారు. కుండా వెంకటేశ్వర్లు, బీవీఎస్ రమేష్, నాగరాజు, వైవీ సుబ్బారావు పాల్గొన్నారు.

### మధుమేహం పట్ల అప్రమత్తత అవసరం

పామూరు: మధుమేహం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డాక్టర్ రవళి ప్రియాంక, అసిస్టెంట్ సీడీపీఓ పి.లావణ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహించారు. పోషణ అభియాన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీచేశారు.

### నీటిసరఫరా పైప్‌లైన్‌కు మరమ్మతులు


పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయిస్తున్న సర్పంచ్, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడులో గ్రామ పంచాయతీకి సంబంధించిన నీటి సరఫరా పైప్‌లైన్ జాతీయ రహదారి 167బీలో పగిలిపోయిన నీటి సరఫరా నిలిచిపోయింది. విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ షేక్.ఖాదర్‌బీ దృష్టికితీసుకుపోగా స్పందించిన సర్పంచ్ ఖాదర్‌బీ, వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించగా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# వర్షం పడితే రోడ్లన్నీ చెరువులే


ప్రభుత్వ భవన కార్యాలయ సముదాయంలో నిలిచిన వర్షం నీరు


విష్ణాలయం వీధిలో..

- సైడు కాల్వలు లేక రోడ్డుపైనే నిలుస్తున్న వర్షం నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు

కొండపి: నియోజకవర్గ కేంద్రం కొండపి మెయిన్ రోడ్ వర్షం పడితే చెరువును తలపిస్తోంది. సైడ్ కాల్వలు లేకపోవడంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు అదే వర్షం నీటిలో నడుస్తూ తమ అవసరాల కోసం ప్రయాణం కొనసాగిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికి కూడా మెయిన్ రోడ్‌లో నీరు నిలబడిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరు గొప్ప..ఊరు దిబ్బ అన్న సామెత కొండపి టౌన్‌కు సరిపోతుంది. పేరుకేమో నియోజకవర్గ కేంద్రం కొండపి.. కానీ సామాన్య ప్రజలు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షానికి కొండపి మెయిన్ రోడ్డులోని నలుమూలల్లో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో బస్టాండ్ నుంచి సాయిబాబా గుడికి గిలక లోతు నీరు నిలబడుతుంది. స్థానిక జెండా చెట్టు సెంటర్లో విష్ణాలయం వీధిలో కూడా కొద్దిపాటి వర్షానికి నాలుగైదు రోజులు నీరు నిల్వ ఉంటుంది. పొదిలి రోడ్డులో స్థానిక స్టేట్ బ్యాంక్ దాటిన తర్వాత వర్షం పడిన వారం రోజుల వరకు నీరు అక్కడే నిలబడి ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు నీటిలో నడుచుకుంటూ వెళ్లే సమయంలో వాహనాలు రావడంతో నీరు పాదచారులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ భవనాల వద్ద కూడా అంతే..**

ప్రభుత్వ భవనాల సముదాయం వద్ద కూడా వర్షం నీరు గిలకల్లోతులో ఉంటుందని పనుల కోసం కార్యాలయాలకు వెళ్లే ప్రజలు తెలుపుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇతర కార్యాలయాలకు వెళ్లేందుకు సిమెంటు రోడ్డు నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయం వరకు వర్షం పడితే దాదాపు గిలకల్లోతు వరకు నీరు నిలబడుతుంది. దీంతో ఆయ కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు.

**ప్రధాన సమస్య సైడు కాల్వలు**

రోడ్డుపై వర్షం నీరు నిలవడానికి ప్రధాన కారణం సైడ్ కాల్వలు లేకపోవడమని కొండపి ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక విష్ణాలయం వీధిలో బస్టాండ్ నుంచి అనకర్లపూడి వెళ్లే దారిలో, స్టేట్ బ్యాంక్ సమీపంలో, ప్రభుత్వ భవన కార్యాలయ సముదాయంలో సైడ్ కాల్వలు లేకపోవడంతో వర్షం నీరు అక్కడే నిలబడి ఉంటుంది. ప్రభుత్వ అధికారులు తమ కార్యాలయాలకు వెళ్లే దారిలో నీరు నిలబడుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సైడ్ కాల్వలు నిర్మించాలి:**



కొండపి టౌన్‌లో సైడ్ కాల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ సాయిబాబా గుడి సమీపం విష్ణాలయం ప్రాంతంలో వర్షాలు పడితే నీరు నిలబడుతుంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైడు కాల్వలు నిర్మించి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించాలి.

యామవరపు వీరవసంతరావు,
బీసీ సెల్ నేత

# నేటి చలో మార్కాపురాన్ని జయప్రదం చేయాలి


చలో మెడికల్ కాలేజీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సింగరాయకొండ: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలో మార్కాపురం కార్యక్రమంపై ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో 12 మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో ఉండగా చంద్రబాబు హయాంలో ప్రైవేటుగా 19 మెడికల్ కాలేజీలు ఏర్పడ్డాయని, అదే జగనన్న హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేయించి వాటిలో 5 కాలేజీలు ప్రారంభించారని గుర్తు చేశారు. పేద ప్రజలకు మెడిసిన్ విద్యను దూరం చేసే ప్రయత్నం చేస్తున్న చంద్రబాబు మార్కాపురం కాలేజీని కూడా ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్నాడని, శుక్రవారం మార్కాపురంలో నిర్వహించే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, దద్దుగుంట మల్లికార్జునరావు, చింతపల్లి హరిబాబు, ఢాకా పిచ్చిరెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, యనమల మాధవి, గొల్లపోతు గోవర్ధన్, షేక్ మహమ్మద్ భాషా, సోమిశెట్టి సురేష్, పెరికాల సునీల్, షేక్ కరీం, షేక్ అల్లా, షేక్ అబ్దుల్లా, బుజ్జమ్మ, బత్తిన మనోహర్, అంజిరెడ్డి, భువనగిరి సత్యనారాయణ, దాసు శ్రీను, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, సాయికోటి పాల్గొన్నారు.

## నారుమడులు అనధికారికంగా పెంచితే చర్యలు


రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి సత్య శ్రీనివాస్

కొండపి: రైతులు అనధికారికంగా నారుమడులు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు విజిలెన్స్ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎం.సత్య శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం కొండపి బోర్డు పరిధిలోని పైడిపాడు, చతుకుపాడు, కామేపల్లి, గ్రామాల్లో రైతుల పెంచుతున్న నారుమడులను ఆయన ఆకస్మికంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవాలు, పొగాకు అమ్ముకునేందుకు రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 2025–26 పంట కాలానికి నారుమడి దశ నుంచి బోర్డు పంట సాగును నియంత్రించే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. బోర్డు కార్యాలయంలో నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గరిష్టంగా ఐదు ఎకరాలకు రిజిస్ట్రేషన్ పొందవచ్చని తెలిపారు. నారుమడి మోనిటరింగ్ టీం సభ్యులు మోతీలాల్, క్షేత్ర సహాయకులు మనీష్‌కుమార్ పాల్గొన్నారు

టంగుటూరు: నారుమడులు సాగు చేసే రైతులు బోర్డు అనుమతి తీసుకోవాలని విజిలెన్స్ అధికారి సత్య శ్రీనివాస్ అన్నారు. వావిలేటిపాడు, జరుగుమల్లి, చింతలపాలెం, దావగూడూరు గ్రామాల్లో పెంచుతున్న నారుమడులను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు బోర్డు పొగాకు పంట సాగును నియంత్రించే విధంగా చర్యలు చేపడుతుందని తెలిపారు. పొగాకు బోర్డు కార్యాలయంలో తమ నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. గరిష్టంగా ఐదు ఎకరాలకు రిజిస్ట్రేషన్ పొందొచ్చని తెలిపారు. విజిలెన్స్ బృందంతో పాటు పొగాకు బోర్డు క్షేత్రాధికారి ఉపేంద్ర, సహాయకులు మోతీలాల్, ఫణిశ్రీ, శివారెడ్డి పాల్గొన్నారు.

## విద్య పరిరక్షణకు యూటీఎఫ్ పోరాటం

- 25న రణభేరిని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు

కనిగిరిరూరల్: విద్య, ఆర్థిక అంశాల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోరాటం సాగిస్తోందని సంఘ రాష్ట్ర కార్యదర్శి వన కోటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ రణభేరి జాత, బైక్ ర్యాలీ కనిగిరిలోకి గురువారం ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ డివిజన్ నాయకులు నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం గంగ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం కనిగిరి పట్టణంలోని సుగుణావతమ్మ సెంటర్‌లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్ హై మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రానున్న రోజుల్లో జరిగే ఉద్యమాలకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులపై వత్తిడి తగ్గించకుంటే తగు రీతిలో స్పందిస్తామన్నారు. సెప్టెంబర్ 25న విజయవాడలో జరిగే యూటీఎఫ్ రణభేరి కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు పోతులూరయ్య, రాము, ఎస్కే ఖాజారంతుల్లా, ఉమాహేశ్వరి, రుషేంద్ర, మీగడ వెంకటేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు


మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్సై జిలానీబాష


మందుబాబులను హెచ్చరిస్తున్న సీఐ హజరతయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు

పామూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్సై షేక్.జిలానీబాష అన్నారు. మండలంలోని పలు గ్రామాలు, ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పామూరు పరిసరాల్లో చేపట్టిన తనిఖీల్లో పలువురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడగా వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వలు ఉంచినా, విక్రయిస్తున్నా, తరలిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు**

టంగుటూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. టంగుటూరు–అనంతవరం గ్రామాల మధ్య ఉన్న రాగాయికుంటకు వెళ్లే దారిలోని రైతుల పొలాల పక్కన జామాయిల్ చెట్లు, వేప చెట్ల కింద మందుబాబులు కూర్చొని మద్యం తాగి బాటిళ్లు పగలగొడుతున్నారు. దీంతో రైతులకు ఇబ్బందిగా మారింది. రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సీఐ హాజరత్తయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ నాగమల్లేశ్వరరావు మందుబాబులను గుర్తించారు. గురువారం వారితోనే ఆ పరిసరాలను శుభ్రం చేయించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## టీకాలతో పశువ్యాధుల నియంత్రణ సాధ్యం


గాలికుంటు వ్యాధి టీకా వేస్తున్న జేడీ రవి

టంగుటూరు: సకాలంలో టీకాలతోనే పశువ్యాధుల నియంత్రణ సాధ్యమని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ రవి అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 15 నుంచి నెల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పాడి పశువులకు చేపడుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం గురువారం మండలంలోని సురారెడ్డిపాలెంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నాలుగు రోజులుగా పశువులకు చేసిన టీకాల వివరాలు, టీకాల భౌతిక నిల్వలు పరిశీలించారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు పశువులు తీవ్ర జ్వరంతో నీరసించి ఉంటాయని చెప్పారు. పాలు తాగే దూడల్లో మరణ శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టంగుటూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కనుకుర్తి సుధీర్‌బాబు, సూరారెడ్డిపాలెం పశువైద్యాధికారి ఎం.సోమశేఖర్ పాల్గొన్నారు.

## చంద్రబాబు మాదిగలను సీఎం చేయగలరా?


అశోక్‌ను అభినందిస్తున్న చింతా మోహన్

టంగుటూరు: సామాజిక న్యాయం చెప్పే చంద్రబాబు మాదిగలను ముఖ్యమంత్రి చేయగలరా..అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు విజయవంతంగా నిర్వహించిన మాల ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తులిబిల్లి అశోక్‌బాబును ఆయనతో పాటు జిల్లాలోని మాలల జేఏసీ నాయకులు గురువారం అభినందించారు. తొలుత టంగుటూరు అంబేద్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చింతా మోహన్ మాట్లాడుతూ దళితులందరూ ఐక్యంగా ఉన్నప్పుడు మాత్రమే అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను కాపాడుకోగలమన్నారు. మాలల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, నాయకులు బాల నారాయణ, మేడిద రవి, పులగర కృష్ణయ్య, చంద్రబాబు, బాలు పాల్గొన్నారు.

## 'ఛలో మార్కాపురం మెడికల్ కాలేజ్' జయప్రదం చేయండి


దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: మెడికల్ కాలేజీ ప్రవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 19న శుక్రవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఛలో మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల నాయకులతో కలిసి మార్కాపురం మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుతంగా పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దద్దాల నారాయణ కోరారు.

## మహిళా ఆరోగ్యం ఎంతో ముఖ్యం


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యకరంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక అర్బన్ హెల్త్ కేంద్రంలో ఆరోగ్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఫణికుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు, రమేష్‌బాబ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వెదురు పర్యావరణానికి మిత్రమని, గ్రామీణ జీవనోపాధికి ప్రధాన ఆధారమని తెలిపారు. సంస్థ చైర్మన్ మంద్రు రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

## 30లోపు ఈ-పంట నమోదు పూర్తి చేయాలి


కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఏడీఏ

కొండపి: ఈ–పంట నమోదును సెప్టెంబర్ 30వ తేదీ లోపు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎం.రజని అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రం కొండపిలో సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని కొండపి, సింగరాయకొండ, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఏడీఏ ఈ.నిర్మలాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సాగు చేసే పంటలపై సమగ్ర సస్యరక్షణ చర్యలు వివరించారు. వివిధ రకాల పంటల్లో వచ్చే తెగుళ్లు, పురుగుల గురించి ఏపీ ఎయిమ్స్ 2.0లో ఏ విధంగా అప్లోడ్ చేయాలో, రైతులకు సమాచారం ఎలా అందించాలో వివరించారు. అనంతరం పెట్లూరులో కంది, వరి పైరులను పరిశీలించి శాస్త్రవేత్త వెంకటేష్ కంది పంటలో వెర్రి తెగులు, వరిలో పాముపొడ తెగులు గుర్తించి నివారణ చర్యలను వివరించారు. ఒంగోలు డీఆర్సీ ఏవోలు శైలజ, శేషమ్మ, కొండపి ఏవో మాల్యాద్రి, బీటీఎం షరీఫ్, ఏఈఓ కుమార్, వీఏఏ కొండలరావు, మీరావలి పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పొన్నలూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పొన్నలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం పీహెచ్‌సీ వైద్య బృదం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్యం, శ్రేయస్సు ఒక శక్తివంతమైన కుటుంబానికి పునాది అని, అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ సుజాత, పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, రవికిరణ్, సీహెచ్‌ఓ భాస్కరరావు, బీపీఎంఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నాణ్యమైన బేళ్లకే అధిక ధర

కొండపి: నాణ్యమైన బేళ్లకే అధిక ధర లభిస్తుందని వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం పొగాకు వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటల మార్పిడి చేసుకోవాలని, బోర్డ్ అనుమతించిన మేర పొగాకు సాగు చేయాలని సూచించారు. రైతులు తమ వద్ద ఉన్న బేళ్ల వివరాలు తెలియజేయాలన్నారు. వేలానికి ఒక రోజు ముందు వచ్చి మార్కెట్ వివరాలు తెలుసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 960 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 725 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 235 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ. 345, కనిష్ట ధర కేజీ రూ.105, సరాసరి ధర కేజీ రూ.211.43గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

**పొగాకు గరిష్ట ధర రూ.346**

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.346 పలికింది. కారుమంచి, ఎం. నిడమానూరు గ్రామాలకు చెందిన రైతులు 974 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 814 కొనుగోలు జరిగాయి. 160 పొగాకు బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.346 కాగా కనిష్ఠ ధర రూ.110 పలికింది. సరాసరి రూ.244.77 ధర పలికింది. వేలంలో మొత్తం 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ: మండల కేంద్రంలోని సోమరాజుపల్లి పంచాయతీ నర్రావానిపాలెం సమీప రైల్వే ట్రాక్‌పై గురువారం గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఎత్తు 5.6 అడుగులని, నలుపు, గోధుమ రంగు అరచేతుల షర్టు ధరించి ఉన్నాడని, గ్రేకలర్ షార్ట్ లోపల ధరించి ఉన్నాడని, మృతుడి గురించి ఎటువంటి ఆధారాలు లభించలేదని వివరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

## పైపులైన్లు పగలడంతో ఆగిన నీటి సరఫరా

పీసీపల్లి: పీసీపల్లి పంచాయతీలో విజయనగర కాలనీ, ఆదర్శ కాలనీ, పీసీ పల్లి, గోపవరపువారిపల్లి, గోపవరపువారిపల్లి ఎస్సీ కాలనీ మూడు కాలనీలకు, మూడు గ్రామాలకు నీటి సరఫరా సుమారు వారం రోజులుగా ఆగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పీసీ పల్లి పంచాయతీకి సుమారు మూడు కిలోమీటర్ల నుంచి డీప్‌బోర్ తో నీటి సరఫరా అధికారులు చేపట్టారు. అయితే వారం రోజులుగా పైపులైను పగిలిపోవడంతో నీటి సరఫరా ఆగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో ఆ నీటిని రెండు మూడు రోజులు అవసరాలకు వాడుకున్నారు. మళ్లీ నీటి సమస్య తలెత్తింది. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి మరమ్మతులు చేసి నీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.